## అన్న – కయప

**మూల వాక్యము : మత్తయి 26 : 57** యేసును పట్టుకొనినవారు **ప్రధాన యాజకుడైన కయప** యొద్దకు ఆయనను తీసికొనిపోగా, అక్కడ శాస్త్రులును పెద్దలును కూడియుండిరి.

**యోహాను 18 : 12,13** అంతట సైనికులును సహస్రాధిపతియు, యూదుల బంట్రౌతులును యేసును పట్టుకొని ఆయనను బంధించి, **మొదట "అన్న" యొద్దకు** ఆయనను తీసికొనిపోయిరి. 13 అతడు ఆ సంవత్సరము ప్రధాన యాజకుడైన కయపకు మామ.

* **అన్న ఇది వరకు గడచిన సంవత్సరాలలో ప్రధాన యాజకుడుగా పనిచేసినవాడు.**
* **కయప ఆ సంవత్సరము ప్రధాన యాజకుడు...**
* **అన్న ప్రధాన యాజకుడైన కయపకు మామ.**

**మరియు ప్రభువును పట్టుకొనిన వారు మొదట ఆ సంవత్సరము ప్రధాన యాజకుడైన కయప యొద్దకు, లేదా సభ యొద్దకు తీసుకొని వెళ్లలేదు గాని ప్రధాన యాజకునికి మామయైన అన్న యొద్దకు తీసుకొని వెళ్లినట్లు పైలేఖనము మనకు తెలియ జేస్తుంది. దాని అర్థం అన్న ఆ సంవత్సరము ప్రధాన యాజకుడు కాక పోయినప్పటికి తన అల్లుడు ప్రధాన యాజకుడు గనుక, తన అల్లుని బట్టి ఈయన తన ప్రాబల్యాన్ని కనుపరుస్తున్నాడు కనుకనే బంట్రౌతులు ప్రభువును పట్టుకొనినప్పుడు మొదట అన్న యొద్దకు తీసుకువెళ్లారు.**

### I. ప్రధాన యాజకుడైన అన్న యేసుక్రీసును విచారించిన విధానము :

**ఆయన శిష్యులను గూర్చి, ఆయన బోధను గూర్చి అడుగుట : యోహాను 18 : 19** ప్రధాన యాజకుడు ఆయన శిష్యులను గూర్చియు ఆయన బోధనుగూర్చియు యేసును అడుగగా. ఆయన ఈ మాటలు చెప్పినప్పుడు దగ్గర నిలిచియున్న బంట్రౌతులలో ఒకడు – ప్రధానయాజకునికి ఈలాగు ఉత్తరమిచ్చుచున్నావా అని చెప్పి యేసును అర చేతులతో కొట్టెను.

**బంధింపబడి ఉన్నట్టుగానే యేసును ప్రధాన యాజకుడైన కయప యొద్దకు పంపెను : యోహాను 18 : 24** అంతట అన్న, యేసును బంధింపబడియున్నట్టుగానే ప్రధానయాజకుడైన కయప యొద్దకు పంపెను.

### II. ప్రధాన యాజకుడైన కయప యేసుక్రీస్తును విచారించిన విధానము :

**యేసును చంపవలెనని ఆయనకు విరోధముగా అబద్ధ సాక్ష్యము వెదకిరి : మత్తయి 26 : 59** ప్రధాన యాజకులును, మహాసభ వారందరును, యేసును చంపవలెనని ఆయనకు విరోధముగా అబద్ధసాక్ష్యము వెదకుచుండిరి కాని.

**నీవు ఉత్తరమేమియు చెప్పవా? అని ప్రశ్నించాడు : మత్తయి 26 : 62** ప్రధాన యాజకుడు లేచి నీవు ఉత్తర మేమియు చెప్పవా? వీరు నీమీద పలుకుచున్న సాక్ష్యమేమని అడుగగా యేసు ఊరకుండెను.

**నీవు దేవుని కుమారుడవైతే క్రీస్తువైతే ఆ మాట మాతో చెప్పమని ఆన(ఒట్టు) పెట్టినాడు : మత్తయి 26 : 63,64** అందుకు ప్రధానయాజకుడుఆయనను చూచి నీవు దేవుని కుమారుడవైన క్రీస్తువైతే ఆ మాట మాతో చెప్పుమని జీవముగల దేవుని తోడని నీకు ఆనబెట్టుచున్నాననెను. అందుకు యేసు – నీవన్నట్టే. 64 ఇది మొదలుకొని మనుష్య కుమారుడు సర్వశక్తుని కుడిపార్శ్వమున కూర్చుండుటయు, ఆకాశ మేఘారూఢుడై వచ్చుటయు మీరు చూతురని

చెప్పుగా.

**<u>తన వస్త్రములు చింపుకున్నాడు : మత్తయి 26 : 65</u>** ప్రధాన యాజకుడు తన వస్త్రము చింపుకొని వీడు దేవ దూషణ చేసెను; మనకిక సాక్షులతో పని ఏమి? ఇదిగో ఈ దూషణ మీరిప్పుడు వన్నారు.

* **<u>యాజకులు బట్టలు చింపుకొనకూడదు : లేవి 10 : 6</u>** అప్పుడు మోషే అహరోనును అతని కుమారులైన ఎలియాజరు ఈతామారను వారితో – మీరు చావకుండునట్లును యెహోవా ఈ సర్వసమాజముమీద ఆగ్రహపడకుండునట్లును, మీరు తల విరియబోసికొనకూడదు; బట్టలను చింపుకొనకూడదు కాని, యెహోవా వారిని కాల్చినందుకు మీ సహోదరులైన ఇశ్రాయేలీయుల యింటివారందరు ఏడవ వచ్చును.

**లేవీ 21 : 10** ప్రధాన యాజకుడగుటకై తన సహహోదరులలరెవరి తలమీద అభిషేకతైలము పోయబడునో, యాజకవస్త్రములు వేసికొనుటకు ఎవరు ప్రతిష్ఠింపబడునో అతడు తన తలకప్పును తీయరాదు; తన బట్టలను చింపుకొనరాదు.

**తాను దేవుని కుమారుడనని చెప్పుకొని ధర్మశాస్త్రమును అతిక్రమించాడని ప్రభువుపైన నేరం మోపబడింది. ఆ కారణము చేతనే ఆయనకు మరణ శిక్ష విధించాలని ప్రజలు కోరారు, అయితే వస్త్రములు చింపుకొనకూడదని ప్రధాన యాజకులకు యాజకులకు ధర్మశాస్త్రం ఆజ్ఞాపించింది. ఆ ఆజ్ఞను అతిక్రమించిన ప్రధాన యాజకులకు శిక్ష యేమియు లేక పోవటం ఇక్కడ మనం చూడగలము. మనకైతే ఒక న్యాయం, యెదుటి వారికి మరొక న్యాయం అ నేసిద్ధాంతం అనాటి యూదుల సమాజంలో బలంగా పని చేస్తున్నట్లు మనం అర్థం చేసుకోవాలి.**

**<u>ఏమి తీర్పు ఇవ్వాలని ప్రజలను అడిగాడు : మత్తయి 26 : 66</u>** మీకేమి తోచుచున్నదని అడిగెను. అందుకు వారు – వీడు మరణమునకుపాత్రుడనిరి.

**<u>పిలాతుకు అప్పగించిన వారిలో ఒకడు : మత్తయి 27 : 1,2</u>** ఉదయమైనప్పుడు ప్రధానయాజకులును, ప్రజల పెద్దలందరును యేసును చంపవలెనని ఆయనకు విరోధముగా ఆలోచనచేసి. 2 ఆయనను బంధించి, తీసికొనిపోయి, అధిపతియైన పొంతిపిలాతునకు అప్పగించిరి.

**<u>ముగింపు :</u>** ప్రజలు పాపము చేసినప్పుడు దేవాలయమునకు వెళితే అక్కడి యాజకులు ప్రజల పాపము కొరకు పరిహారము చేసి ప్రాయశ్చిత్తము చేయవలసిన వారు. అట్టి యాజకులు పాపము చేసినప్పుడు వారి నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయు పని ప్రధాన యాజకులది. అయితే ఏ పాపము చేయని, ప్రాయశ్చిత్తము అవసరములేని ప్రభువుకి మరణ శిక్ష విధించుట కొరకు ప్రధాన యాజకులు పని చేసి నట్టు మనకు అర్థమౌతుంది. ఇంత అన్యాయాన్ని ప్రభువు నిన్ను నన్ను రక్షించుట కొరకే భరించారని మనము అర్థం చేసుకోవాలి.

అలా ప్రభువు త్యాగాన్ని అర్థ చేసుకునే కృప, జ్ఞానము పరిశుద్ధాత్మ దేవుడు మనకందరికి అనుగ్రహించును గాక. అమేన్.